క్లుప్తంగా

మల్లన్న ఆశీస్సులతో చల్లంగా ఉండాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



జాతరలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని బచ్చగూడెం గ్రామంలో సోమవారం నిర్వహించిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



వెంకప్ప (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం, ఇంద్రేశం గ్రామం నవ్యనగర్‌కు చెందిన వెంకప్ప(50), ఈ నెల 8న రాత్రి ఇంట్లో వారికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతకగా ఆచూకీ లభించ లేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులకు సహకరించండి



సామాజిక తనిఖీపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

మునిపల్లి(అందోల్): ఉపాధిహామీ పథకంలో నిర్వహించిన పనుల పరిశీలనకు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సామాజిక తనిఖీ బృందానికి సహకరించాలని ఎంపీడీఓ హరి నందన్‌రావు సూచించారు. సోమవారం తనిఖీ బృందానికి అవగాహన సదస్సు నిర్వహించా రు. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు రూ.7,75,71,295 కోట్లతో ఉపాధి హామీ పథకంలో కూలీలు మళ్లింపు కాల్వలు, రోడ్లు, పశువుల పాకలు, హార్టికల్చర్ ప్లాంటేషన్, ఇంకుడు గుంతల పనులు నిర్వహించారన్నారు. ఏ పనులు, ఏ గ్రామంలో నిర్వహించారో క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ బృందం పరిశీలిస్తారని తెలిపారు. ఈ నెల 5న తనిఖీ బృందం మండలానికి వచ్చి పనుల జాబితాను పరిశీలించారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ కవిత, ఏపీఓ యాదగిరి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, సామాజిక తనిఖీ బృందం పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పంటల వివరాల నమోదు



ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్న అధికారులు

సంగారెడ్డి టౌన్: పంటల సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఝాన్సీ సూచించారు. సోమవారం మండలంలోని కలబ్‌గూర్ గ్రామంలో క్రాప్ బుకింగ్ మొబైల్ యాప్‌లో పొలాల వద్దకు వెళ్లి ఫొటోలు తీసి ఆన్‌లైన్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంటల సాగు వివరాలు నమోదులో తప్పులు, తెగుళ్లను సకాలంలో గుర్తించకపోవడం, పంటలు కొనుగోళ్ల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో ఏ సర్వే నంబర్ల పొలాల వద్ద ప్రయాణించారనే విధానాన్ని కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ, ఎంఏఓ, ఏఈఓ, రైతులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నారాయణఖేడ్: డివిజన్ పరిధిలోని మనూరు మండలం బోరంచ, ఖేడ్ మండలం పంచగామ 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏడీఏ నాగిరెడ్డి, ఏఈ నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన పనులు చేపడుతున్నందున నిలిపేస్తున్నామని చెప్పారు.

● ఆర్ట్ అదిరింది..

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూళ్లలో కరాటే, యోగా, ఆర్ట్, స్పోర్ట్స్ వంటి కళల్లో శిక్షణ ఇస్తుంది. ఒక్కో విద్యార్థి ఒక్కో రంగంలో ప్రతిభను చాటుతున్నారు. సంగారెడ్డి పూలే రెసిడెన్షియల్ పాఠశాలలో కొంతమంది విద్యార్థులు ఆర్ట్‌లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ గోడలపై రంగురంగుల బొమ్మలు వేస్తున్నారు. ప్రిన్సిపాల్ ధనరాజ్ ప్రత్యేక చొరవతో ఆర్ట్ టీచర్ ప్రభాకర్ శాస్త్రి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వారాంతాపు సెలవు దినాల్లో హాస్టల్‌లో భారతదేశం, తెలంగాణ రాష్ట్రం మ్యాప్ వంటి చిత్రాలతో పాటు గణిత సూత్రాలు, గుణింతాలు, ఆకృతులు, మాయిలర్ చార్ట్, పీరియాడిక్ టేబుళ్లను గోడలపై అందంగా పెయింటింగ్ వేసి ఔరా అనిపిస్తున్నారు.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



భారతదేశ చిత్రపటాన్ని వేస్తున్న విద్యార్థులు



తెలంగాణ రాష్ట్ర చిత్రపటాన్ని వేస్తూ..



స్క్వేర్, క్యూబ్ టేబుల్

డంపు.. కంపు మాకొద్దు

- ప్యారానగర్‌లో నిరసన ర్యాలీ
- భారీ సంఖ్యలో పాల్గొన్న మహిళలు



జేఏసీ ఆధ్వర్యంలో మహిళల భారీ ర్యాలీ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ నల్లవల్లి శివారులోని ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళనలు హోరెత్తాయి. అన్ని వర్గాల ప్రజలతో జేఏసీ ఏర్పాటు చేసి కన్వీనర్ జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసనలు ర్యాలీ చేపట్టారు. సోమవారం అఖిలపక్ష నాయకులతో కలిసి మహిళలు పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించి.. డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డంపు.. కంపు మాకొద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ ర్యాలీలో పాల్గొన్నారు. పచ్చనిపంట పొలాలతో సస్యశ్యామలంగా ఉండే మండలంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు వద్దని తెగేసి చెప్పారు. ఈ మేరకు యువకులు పెద్ద ఎత్తున ముఖ్యమంత్రికి పోస్టుకార్డులపై తమ నిరసనను వ్యక్తం చేస్తూ డంపింగ్ యార్డు ఆలోచన విరమించుకోవాలని లేఖలు రాశారు. మండలంలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఎటు చూసినా ర్యాలీలు, ఆందోళనతో గ్రామాలు దద్దరిల్లుతున్నాయి. కార్యక్రమంలో జేఏసీ కమిటీ సభ్యులు మహిళలు యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

జహీరాబాద్: డివిజన్‌లో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.రాహుల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మొగులప్ప, ఉపాధ్యక్షుడిగా ఎం.కిరణ్, కార్యదర్శిగా ఆర్.సాయినాథ్, సహాయ కార్యదర్శిగా ఎన్.ప్రవీణ్, కోశాధికారిగా రాములును ఎన్నుకున్నారు.

వైభవంగా శివ మహాపడిపూజ



జిన్నారం(పటాన్‌చెరు): అనిల్ గురుస్వామితో శివస్వాములు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలోని తాబేలు గుట్టపై నూతనంగా నిర్మిస్తున్న జీవన జ్యోతిర్లింగ శివాలయం ఆవరణలో శివస్వాములు ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజను సోమవారం వైభవంగా నిర్వహించారు. శివనామస్మరణతో జిన్నారం మండల కేంద్రం మార్మోగింది. వీరన్నగూడెం మడపతి అనిల్‌గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. చుట్టూ పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్య క్రమంలో సాయి, గురుస్వాములు సురేందర్‌గౌడ్, గణేష్, శివాలయ స్వాములు పాల్గొన్నారు.



నారాయణఖేడ్: పూజలో పాల్గొన్న దీక్షాధారులు

ఖేడ్‌లో మహాపడిపూజ

నారాయణఖేడ్: పట్టణంలోని కాశీనాథ్ ఆలయంలో సోమవారం శివదీక్షాధారుల ఆధ్వర్యంలో మహాపడిపూజను వైభవంగా నిర్వహించారు. పడిపూజతో పాటు గురురాజశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామావళి, సహస్రనామావళి, భజన, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. శివదీక్షాధారులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



టోర్నీలో గెలుపొందిన కడ్పల్ జట్టు

కల్హేర్(నారాయణఖేడ్): యువత క్రీడల్లో రాణించాలని బంజారా సంఘం రాష్ట్ర నాయకులు చరణ్‌సింగ్ కోరారు. సోమవారం సిర్గాపూర్ మండల కేంద్రంలో వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కడ్పల్ జట్టు, మనూరు జట్టు మధ్య ఫైనాల్ మ్యాచ్ జరిగింది. ఇందులో కడ్పల్ జట్టు ఫైనాల్ విజేతగా నిలిచింది. విజేతలను చరణ్‌సింగ్ అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు విఠల్‌నాయక్, గణేష్, యువజన సంఘం బాధ్యులు నర్సగౌడ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు డబుల్ బెడ్ రూమ్‌ల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. సోమవారం డబుల్ ఇళ్ల సమస్యలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు పది రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. తాత్కాలికంగా పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు. రవాణా సౌకర్యం మెరుగుపరుస్తున్నామన్నారు. చెత్త సేకరణకు వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

కొనసాగుతున్న భవానిమాత జాతర

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని రత్నాపూర్‌లో భవాని మాత జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉ. 9గంటల నుంచి 11గంటల వరకు దేవిపురాణ పఠనం కార్యక్రమం నిర్వహించారు.

ఆలయ భూములు కాపాడండి



ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

నారాయణఖేడ్: పట్టణ శివారులోని నాలాను కబ్జా చేసి రియల్టర్లు వంతెన నిర్మించారు. పక్కనున్న కాశీనాథ్ ఆలయ భూములను కూడా కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని శివశక్తి ఆర్గనైజేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ శ్రీనివాస్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధవరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. ప్రైవేట్ భూమిని కొనుగోలు చేసిన స్థిరాస్తి వ్యాపారులు ఆ భూమికి రోడ్డు లేకపోవడంతో ఆలయం భూముల గుండా ఉన్న నాలాను కబ్జాచేసి అక్రమంగా వంతెన నిర్మించారని ఆరోపించారు. వంతెన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు. ఆలయ భూమిలో ఉన్న నాలాను పీడబ్ల్యూడీ రోడ్డు గుండా డైవర్ట్ చేసి ఆలయ భూమిని వెంచర్‌లోకి తీసుకున్నారని తెలిపారు. ఆలయ భూములను కబ్జా చేసి ప్రైవేటు భూమిలో కలుపుకొని ప్లాట్లుగా విక్రయించడానికి యత్నిస్తున్నారని మండిపడ్డారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ నూతన కార్యవర్గం ఎన్నిక

నారాయణఖేడ్: డివిజన్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సున్నం నర్సింహులు ఎన్నికైనట్లు ఖేడ్ టీఎన్జీఓ సంఘం అధ్యక్షుడు చంద శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా భాగన్న, ఉపాధ్యక్షుడిగా అనిల్, కోశాధికారిగా నర్సింహారాజు, సంయుక్త కార్యదర్శిగా సుదర్శన్, ప్రచార కార్యదర్శిగా ఆశయ్య, ఈసీ సభ్యుడిగా లక్ష్మి, సుమీనాబేగం, లింగయ్యలు ఎన్నికైనట్లు వారు ప్రకటించారు. మూడు సంవత్సరాల పాటు వీరు పదవిలో కొనసాగుతారని తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీఓల సంఘం జహీరాబాద్ అధ్యక్షుడు క్రిష్ణవంశీ, ఈసీమెంబర్ బాలమణి పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరయిన చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. మనూరు మండలం పుల్‌కుర్తికి చెందిన ఇనాందార్ షెహనాజ్‌బీకి రూ.50వేలు మంజూరు కాగా ఆమె కుమారుడు మన్సూర్‌కు కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్ రెడ్డి అందజేశారు. అలాగే, కంగ్టి మండలం చౌకాన్‌పల్లికి చెందిన పెంటయ్యకు రూ.25,500, గాజుల్‌పాడ్‌కు చెందిన జాదవ్ సతీష్‌కు రూ.18,500, ముర్కుంజాల్‌కు చెందిన బాల్‌రెడ్డికి రూ.21,500 మంజూరు అయ్యాయి. ఈ చెక్కులను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ నర్సింహ్మారెడ్డి, మాజీ సర్పంచ్‌లు సాయిలు, గంగారాం పాల్గొన్నారు.

◆ శివాలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలోని తాబేలు గుట్టపై నిర్మిస్తున్న జీవన జ్యోతిర్లింగ శివాలయానికి హైదరాబాద్‌కు చెందిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ సత్యనారాయణ దంపతులు లక్ష రూపాయల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శంకరయ్య, ఫణిగుప్తా, ప్రభాకర్ ఉన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 26 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. సోమవారం వారిని సంగారెడ్డి కోర్టులో హాజరు పరచగా 21 మందికి రూ.2 వేలు, నలుగురికి రూ.1,500 మరో వ్యక్తికి వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

17 మందికి జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి సంగారెడ్డి జాతీయ రహదారి, పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 17మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం కోర్టు హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ ఉత్తమ విద్యను అందించాలి

జహీరాబాద్: మండలంలోని చిరాగ్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శిథిలమయింది. దీంతో కొత్త భవనాన్ని నిర్మించనున్నట్లు ఉజ్వల్ ఫౌండేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎన్ఆర్ఐ, ఎస్.ఉజ్వల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉజ్వల్‌రెడ్డి తన తండ్రి, మాజీ ఎంపీపీ ఎస్.నారాయణరెడ్డి చేతుల మీదుగా పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి రూ.3కోట్ల వ్యయంతో పాఠశాల భవన నిర్మాణానికి ప్రతిపాదించారు. ఈ సందర్భంగా ఉజ్వల్‌రెడ్డి మాట్లాడుతూ.. ట్రస్ట్ ద్వారా గ్రామంలో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు చేశామన్నారు. పాఠశాల భవనం నిర్మించి ఉత్తమ విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ధర్మం వైపు నడవాలి

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర



పూజల్లో పాల్గొన్న మంత్రి దామోదర తదితరులు

జోగిపేట(అందోల్): ప్రతి ఒక్కరూ ధర్మం వైపు నడుస్తూ భగవంతుడి కృపకు పాత్రులు కావాలని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం జోగిపేటలో కేతకీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరయ్యారు. మల్లిఖార్జున స్వామి, రాజరాజేశ్వర దేవాలయం, శ్రీసీతారామచంద్రుడి ఆలయాల్లో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయం ఆవరణలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం లేదా షెడ్ నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. ఆలయ రహదారి పక్క నుంచే అజ్జమర్రి–జోగిపేట మధ్య వంతెన నిర్మాణం చేపట్టి రోడ్డును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణం వల్ల ఈ ప్రాంతానికి కొంత నష్టం జరిగిందని, పూర్వ వైభవం కోసం అజ్జమర్రి రోడ్డు మంజూరు చేయించినట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య యాదవ్, జీహెచ్ఎంసీ కార్పొరేటర్ పుష్ప, ఏఎంసీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ ఎస్. జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహాన్ని ప్రతిష్ఠించిన భక్తులు

మునిపల్లి(అందోల్): పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం మండలంలోని ఖమ్మంపల్లి శివాలయంలో సంగమేశ్వర స్వామి విగ్రహాలతో పాటు దేవాలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. 108 శివయోగి శివాచార్య మహాస్వామి, వీరేశ్వర శావాచార్య మహాస్వామి పీఠాధిపతులు హాజరై ప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమానికి హాజరైన మాజీ ఎంపీపీ రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్‌లను శాలువా కప్పి, మెమోంటో అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష కుమార్, బేల్లూర్ మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి, బోడపల్లి మాజీ సర్పంచ్ రాములు, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా సర్వతో ముఖియాగం



యాగంలో అలంకరణలు చేస్తున్న ఋత్వికులు

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని కృష్ణాపూర్ గ్రామ శివారులో చేపట్టిన సర్వతో ముఖయాగం వైభవంగా కొనసాగుతోంది. బాలమార్తాండ్ చయనయాజీ ఆధ్వర్యంలో పూజలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం మధ్యమ హస్సు, పూర్వోత్తర ప్రాతః ప్రవర్గ్య, ఉపాసత్, సుబ్రహ్మణ్యాహ్వానం, కాటక చయనం, తూర్పున సవిత్ర చయన, దక్షిణాన నచికేత చయన, పశ్చిమం, చతుర్హోత్ర చయన, ఉత్తరాన వైశ్వసృజ చయనం, సాయంత్రం పూర్వోత్తర సాయం ప్రవర్గ్య తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సే షరీఫ్ ఉత్సవాలు



దర్గాలో పూజలు చేస్తున్న భక్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ గ్రామశివారులోని ఉర్సే షరీఫ్ ఫీర్‌గైబ్ సాహెబ్ దర్గాలో జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. నాల్గొవ రోజు సోమవారం న్యాల్‌కల్ గ్రామం నుంచి దర్గా వరకు బాజభజంత్రీలతో ఖురేషి గంధం తీసుకెళ్లారు. ఖవాలీ కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. దర్గా పరిసర ప్రాంతాల నుంచే కాకుండా సమీపాన కర్నాటక రాష్ట్రం నుంచి ప్రజలు దర్గాకు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. న్యాల్‌కల్ పీహెచ్‌సీ వారు జాతరలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

నేడు కుస్తీపోటీలు

ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జాతరలో కుస్తీ పోటీలు నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్రకు చెందిన మల్లయోధుల పోటీల్లో పాల్గొననున్నారు. ప్రతిభ కనబర్చిన మల్లయోధులకు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.


మహామండలేశ్వర అధిపతిగా సిద్ధేశ్వరస్వామి

రాష్ట్రానికి అరుదైన గౌరవం



ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రంగా బాసిల్లుతున్న బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతికి అరుదైన గౌరవం దక్కింది. ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న మహా కుంభమేళాలో వివిధ అఖండాలకు సంబంధించిన మఠాధిపతులు, పీఠాధిపతులు పాల్గొన్నారు. ఇందులో శంకరాచార్యులు స్థాపించిన జూన అఖండ ఒకటి. తెలంగాణ రాష్ట్రం నుంచి మహామండలేశ్వర అధిపతిగా దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి డా.సిద్ధేశ్వరస్వామిని అఖండ అధిపతి ఆచార్య 1008 అవదేశానందగిరి మహారాజ్ సంబంధిత మఠాధిపతులు, అధికారులు ఎంపిక చేసి 1008 బిరుదుతో పాటు మహా మండలేశ్వర్‌గా పట్టాభిషేకం నిర్వహించారు. సిద్ధేశ్వరానందగిరి మహారాజ్‌ను మహామండలేశ్వర అధిపతిగా నియమించడంపై ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, వివిధ ఆశ్రమాల మఠాధిపతులు, పీఠాధిపతులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

కుంభమేళాలో జిల్లావాసులు



త్రివేణి సంగమంలో జిల్లావాసులు

సదాశివపేట (సంగారెడ్డి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో సంగారెడ్డి, సదాశివపేట, మియాపూర్‌కు చెందిన 150 మంది భక్తులు సోమ వారం పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం వారణాసి కాశీ విశ్వనాథ్, అయోధ్యలో శ్రీరాముడి దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో రుక్మయ్య, నారాయణ, రంగయ్య, మనోహర్, బిట్లరాజు, ప్రకాష్, రమేష్, కరుణాకర్, మల్లేశం, ప్రవీణ్‌కుమార్, ఏఎస్ఐలు రాములు, గాలయ్య పాల్గొన్నారు.